అప్పాజోస్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ (యుఎస్ఏ), ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిర్వహించిన కథల పోటీలో 'కథాప్రభ' కు ఎంపికైన కథ

కారం కారం కథా ప్రభ

ఉదయం నుండీ మనసంతా ఆందోళనగా ఉండడంతో కాలేజీకి సెలవు పెట్టి ఇంట్లోనే కూర్చున్నాను. మధ్యాహ్నం పన్నెండు దాకా టీవీలో కానీ రేడియోలో కానీ వార్తలయితే ఏవీ లేవు. టైం గడుస్తున్న కొద్దీ మనసులో ఉత్కంఠ పెరగసాగింది.

టౌన్లో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. గిరిధర చౌదరిని మంత్రివర్గంలోకి తీసుకున్నట్లు ఫోన్ మెసేజ్ వచ్చిందని పది గంటలకే ఆయన అభిమానులు పెద్దయెత్తున టపాకాయలు కాల్చినారు. అనంతపురం మెయిన్ రోడ్లన్నీ హోరెత్తి పోయినాయి. మధ్యాహ్నం పన్నెండు గంటలకు మరొక వార్త వినిపించింది. రంగారెడ్డి మంత్రి అయినట్లు తెలిసిందని ఆయన అనుయాయులు ఆనందోత్సాహాలతో కేకలు వేసినారు. టౌనంతా భరించరాని శబ్దాలతో దద్దరిల్లి పోయింది.

కదిరి శాసన సభ్యుడు రంగారెడ్డి, ధర్మవరం శాసన సభ్యుడు గిరిధర చౌదరీ జిల్లాలో పుష్కలంగా అంగబలమూ, అర్థబలమూ ఉన్నవాళ్లే. ఉదయం నుండీ వాళ్ల అభిమానుల ఆనందోత్సాహాలను గమనించిన తర్వాత వాళ్లిద్దరూ తప్పక మంత్రి వర్గంలో ఉంటారని

అనుకున్నాను. వారం రోజులుగా పత్రికలు కూడా వాళ్లను గురించే రాసినాయి. నేను మనసులో అయితే అనుకున్నాను కానీ అనుకున్నప్పటి నుండీ అసంతృప్తితో మనసంతా నీరస పడిపోయింది. ఈ అగ్రకుల రాజకీయాల్లో శివరాం వంటి బడుగువర్గం వానికి మంత్రిపదవి వస్తుందని ఆశించడం పేరాశే అవుతుందని మనసును సమాధాన పరుచుకుంటూ రేడియో బటన్ నొక్కాను. మంత్రి మండలి ప్రమాణ స్వీకారం గురించి ప్రత్యేక వార్త లొస్తున్నాయి. వింటూ నన్ను నేను నమ్మలేక పోయాను. మిత్రుడు శివరాం మంత్రి అయినాడు. సంతోషంతో శరీరమంతా తేలిపోయింది. వెంటనే మాలతిని పిలిచి చెప్పినాను. తాను ఆనందంతో మురిసి పోయింది. పిల్లలిద్దరూ కాలేజీ నుండీ మధ్యాహ్నం భోజనానికి వచ్చినారు. ఇల్లంతా సంతోషంతో వెల్లివిరిసింది.

భోజనం చేసి సంతృప్తిగా తాంబూలం నములుతూ మిద్దె మీదున్న రూములోనికి వెళ్లి ఈజీ ఛైర్లో కూర్చొని వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాను.



శాంతి నారాయణ

మిత్రుడు శివరాం కేబినెట్ మంత్రి అయినాడు. ఎంత సంతోషమయిన వార్త! శరీరం నిండా ఏవో చెప్పరాని అనుభూతులు పారాడినాయి. గతానికి చెందిన ఎన్నో జ్ఞాపకాలు మనసు నిండా కదలాడినాయి. అవి మననం చేసుకున్నప్పుడు మధురమయినవే అయినా ఆ దినాల్లో శివరాంకూ, నాకూ అవి విషాదమయినవే..

ముప్పై ఆరు సంవత్సరాల కిందట మాట. నేనూ, శివరామూ హైస్కూల్లో చదువుతున్న రోజులవి. తిమ్మాపురం హైస్కూల్ ఆ రోజుల్లో బాగా ప్రసిద్ధి పొందిన స్కూలు. తిమ్మాపురం పక్కనే ఉన్న 'ఎనుముల దొడ్డి'లో మా పిన్నమ్మ ఉండేది. అప్పట్లో వాళ్ల సంసారం బాగుండేది. ఆ దినాల్లో శింగనమల చెరువు సరిగా నిండేది. కాదు. ఆ చెరువు కింద పల్లెలన్నీ ఎప్పుడూ కరువుతో కటకట లాడేవి. మావంటి వాళ్ల కుటుంబాలు గాలికి కొట్టుకొని పోయే జొన్న వాగుడు మాదిరి కూలి కోసం దిక్కుల కొకటి పోయేవి. అంత పేదరికంలో కూడా నాకు చదువు కోవాలని కోరిక ఉండేది. అది గమనించిన మా పిన్నమ్మ నన్ను ఎనుముల దొడ్డికి పిలుచుకొని పోయింది. మా చిన్నాయన నన్ను తిమ్మాపురం హైస్కూల్లో ఎనిమిదో తరగతిలో చేర్చినాడు. నేను ప్రతిరోజూ ఉదయం ఎనుముల దొడ్డి నుండీ మూడు మైళ్లు నడిచి హైస్కూలుకు వెళ్లి చదువుకొని మళ్లీ సాయంకాలానికి ఎనుముల దొడ్డి చేరుకునే వాణ్ణి. అప్పుడే శివరాం కూడా ఎనిమిదో తరగతిలో చేరి నాకు పరిచయ మయినాడు.

శివరాం వాళ్లది తిమ్మాపురానికి దక్షిణం వైపున్న కొత్తపల్లి. నా మాదిరే శివరాం కూడా కొత్తపల్లి నుండీ హైస్కూలుకు నడిచి వచ్చి వెళ్లేవాడు. పల్లెల నుండి వచ్చే వాళ్లందరమూ క్యారియర్లలో మధ్యాహ్నం భోజనం తెచ్చుకునే వాళ్లం. నాదీ, శివరాందీ, ఇంకా అయిదారు మందివీ సిల్వర్ (అల్యూమినియం) క్యారియర్లే. కొంతమంది మాత్రం స్టీలు క్యారియర్లు తెచ్చుకునే వాళ్లు. ముగ్గురు నలుగురు మూడు నాలుగు గిన్నెల క్యారియర్లు తెచ్చుకోవడం చూసి నేనూ, శివరామూ ఆశ్చరపోయే వాళ్లం. అందులో ఏమేమి తెచ్చుకుంటారోనని ఆలోచించేవాళ్లం.

మధ్యాహ్నం స్కూలు వదలగానే క్యారియర్లు తెచ్చుకున్న వాళ్లందరమూ ఊరి బయటున్న నారపరెడ్డి వాళ్ల తోట దగ్గరికి వెళ్లేవాళ్లం. తోట మధ్యలో ఉన్న కపిల బావిలో ఎప్పుడూ నీళ్లు తొలుకులాడేవి. క్యారియర్లు తెచ్చుకున్న వాళ్లలో కాపుదనం పిల్లలు మాత్రం బావిలోకి దిగి కాళ్లూ మొగం కడుక్కొని అక్కడే మెట్ల మీద కూర్చొని అన్నం తినే వాళ్లు. నేనూ శివరాం నరిసిగాడూ రంగన్నా కలిసి బావికి దూరంగా గెనుము ముందున్న కాలువ వొర్ర పక్కన కూర్చొని తినేవాళ్లం. పప్పు వొకరూ పులుసు వొకరూ ఊరు మిండి వొకరూ వండు కారం వొకరూ తెచ్చుకున్నవన్నీ తలాకింత పంచుకోవడం అవీ ఇవీ మాట్లాడుకుంటూ తినడం అలవాటయి పోయింది మాకు. శివరాం మాత్రం ఒక నాడు కూడా పప్పూ పులుసూ తెచ్చుకొనే వాడు కాదు. రాగి ముద్దో కొర్ర బువ్వో తప్ప వరి అన్నం అతని క్యారియర్లో ఎప్పుడూ కనిపించేది కాదు. అది నాకు బాధ కలిగించేది. ఒకసారి కారణమడిగినాను. తన ఇంటి పరిస్థితులన్నీ చెప్పి కళ్లనిండా నీళ్లు నింపుకున్నాడు శివరాం. నాకంటే పేదవాడయిన శివరాం పరిస్థితి తెలిసి మనసు బాధ పడింది.

ఒకరోజు మామూలుగానే కాలువవొర్రపక్కన అన్నం తినడానికి కూర్చున్నాం. నేను క్యారియర్ మూత తీసి ముద్ద మీదున్న వంకాయ బజ్జి మూతలో వేసుకుంటున్నాను. నరిసిగాడూ రంగడూ క్యారియర్లోనే అన్నం కూరా కలుపుకుంటున్నారు. శివరాం మాత్రం ఎంతసేపటికీ క్యారియర్ మూత తీయకుండా ఎక్కడో చూస్తున్నాడు. అక్కడ కూర్చోడానికి ఇబ్బంది పడుతున్నాడు. నాకు అనుమానం వచ్చి శివరాం క్యారియర్ మూత తీసి చూసినాను. క్యారియర్ ఖాళీగా ఉంది. పరిస్థితి నాకర్థమయింది. ఎందుకు ఖాళీ క్యారియర్ తెచ్చుకున్నాడో అర్థం చేసుకున్నాను. శివరాం తటాలున పైకి లేచి వెళ్లబోయినాడు. నేను చేయి పట్టుకుని లాగి కూర్చోబెట్టి అతని ముఖం వైపు చూసినాను. శివరాం కన్నీళ్లు కారుస్తున్నాడు. ఏం జరిగిందని అడిగినాను. రాత్రి ఇంట్లో అందరూ పస్తున్నారని ఆకలితో కళ్లకు మబ్బులు వస్తున్నా యని చెప్పుతూ బోరున ఏడ్చేసినాడు. నా పేగులు తరుక్కు పోయినాయి. దుఃఖం పెల్లుబికి వస్తూ ఉంటే భరించలేక దగ్గరికి జరిగి శివరాంను నా ఒంట్లోకి లాక్కొని కన్నీళ్లు తుడుస్తూ ఓదార్చినాను. కాసేపు అందరమూ బాధపడి తెచ్చుకున్నదంతా ఒకచోట కలిపి తిని చేతులు కడుక్కున్నాం. క్యారియర్లన్నీ కడిగి పెట్టి ఒక చోట గెనుము మీద కూర్చున్నాం. పది నిమిషాల పాటు ఎవరమూ మాట్లాడలేదు. గాలికి వరి వెన్నులు గలగల లాడుతున్నాయి. ఎక్కడో పాము నోట్లో చిక్కిందేమో, కప్ప



మూలుగుతూ ఉంది.

'మా ఇంట్లో పూటపూటకూ గడవడం శానా కష్టమై పోయింది మారెప్పా. 'ఇంగ చదవడం నా శత కాదు. స్కూలు మానేసి యేదన్నా పని చూపుకోవల్లను కుండాను' శివరాం నావైపు చూస్తూ బాధగా అన్నాడు. వచ్చే సంవత్సరం హాస్టల్ పెడతారని హాస్టల్లో చేరితే ఎట్లో కాలం గడిచిపోతుందని అంతవరకూ మేము తెచ్చుకున్నది తింటూ ఉండమని అందరమూ ప్రాధేయ పడినాం. నరిసిగాడూ రంగడూ పుస్తకాలకు సహాయం చేస్తామన్నారు. కొత్తపల్లికి వచ్చి అందరమూ కలిసి ఇంట్లో పెద్దోల్లకు నచ్చజెప్తుతామన్నాం. శివరాం ఏమీ మాట్లాడకుండా మవునంగా ఉండిపోయినాడు.

కూటికీ గుడ్డకూ నలుగుతూ శివరాం నేనూ అట్లే కాలం గడిపినాం. కష్టాలకు అలవాటయి పోయిన మాకు అవన్నీ బాధ కలిగించలేదు కానీ మమ్మల్ని సంఘం చూసే పద్ధతిని తలచుకొని కుమిలిపోయే వాళ్లం. ఒకనాడు మామూలుగానే మధ్యాహ్నం క్యారియర్లు తీసుకొని తోట దగ్గరికి పోయినాం. కాలువ వొర్రలో నీళ్లు లేవు. మాకు దిక్కు తోచలేదు. బాగా ఆకలిగా ఉంది. నీళ్లు తర్వాత చూసుకోవచ్చులే అనుకొని ఆకలితో గబగబా నాలుగు ముద్దలు తిన్నాం. శివరాం తెచ్చుకున్న కొర్ర మెతుకులు పొడిపొడిగా ఉన్నాయేమో గొంతులో పొర పోయింది. శివరాం నీళ్లకోసం పరుగెత్తినాడు. రంగారెడ్డీ సుబ్బిరెడ్డీ వెంకట నాయుడూ తిరుపాలు శెట్టీ బావి మెట్ల మీద కూర్చొని అన్నం తింటున్నారు. వాళ్లంతా మా క్లాస్ మేట్సే. వాళ్లకు కొంచెం దూరంగా నిలబడి 'రంగారెడ్డీ రోన్ని నీళ్లు తెచ్చి పొయ్యవా' అని దగ్గుతూ అడిగినాడు శివరాం.

'మెట్ల తీసక రావల్లోయ్! రొంత సేపుండు. తినేది అయిపొయినంక క్యారియర్ ముంచుకొనిచ్చి పోస్తాను' అన్నాడు రంగారెడ్డి. నోట్లో మెతుకులు నసాళానికి ఎక్కినాయేమో శివరాం తట్టుకోలేక బావిలోకి దిగి దోసిలితో నీళ్లు తాగి ఊపిరి పీల్చుకొని బయటికొచ్చినాడు. వాళ్లందరూ శివరాంను తిట్టినారు. అది చూసి మేము నలుగురమూ ఏకమయినాం. వాళ్లు చేతులు కడుక్కొని నీళ్లు తాగకుండానే నారపరెడ్డి ఇంటి వైపు వెళ్లినారు. ఏదో జరగరానిదే జరుగుతుందని మేము భయపడుతూ స్కూలు చేరుకున్నాం.

మధ్యాహ్నం స్కూలు ప్రారంభమైంది. సోషియల్ టీచర్ హనుమప్ప మా క్లాస్ తీసుకున్నాడు ఆయన క్లాసులో మాత్రమే మేము రెండో బెంచీలో కూర్చుంటాం. మిగతా లెక్కల అయ్యవారు రామిరెడ్డి తెలుగు పండిట్ సుబ్బాశాస్త్రీ సైన్స్ టీచర్ రంగారావూ క్లాసులో మమ్మల్ని వెనక బెంచీలో దూరంగా కూర్చోబెట్టే వాళ్లు. అదేమిటని అడగడానికి మాకు ధైర్యం వచ్చేది కాదు. చిన్నబుచ్చుకొని బాధపడుతున్న మమ్మల్ని చూసి మా కులం ప్రస్తావించకుండా 'మీరు పెద్ద పిల్లలు, వెనక ఉంటేనే మేలు' అని తెలివిగా సర్ది చెప్పేవాళ్లు. వాళ్ల వెటకారపు మాటలు మాకు బాధ కలిగించినా కొన్నాళ్లకు అవి మాకు అలవాటయి పోయినాయి. కూటికి గతిలేని వాళ్లం, ఏమి మాట్లాడగలం?

శివరాం, నేనూ క్లాసులో పాఠం శ్రద్ధగా వింటున్నాం. అంతలో నారపరెడ్డి గట్టిగా నోరు చేస్తూ, 'మా బాయిలేకి దిగి నీళ్లు తాగిండే ఆ మాదిగ నా కొడుకులు యెవురు? యేలు పెట్టేకి సందిస్తే కాలు పెట్టల్లని చూస్తారు తప్పుడు ముండా కొడుకులు' అని బండబూతులు తిడుతూ స్కూల్లోకి వచ్చినాడు. నారపరెడ్డి ఆ ఊర్లో మోతుబరి రైతు. పైగా హైస్కూలు కమిటీ ప్రెసిడెంటు. పూర్తి మొరటు మనిషి. అతనంటే హెడ్మాష్టరుకు కొంచెం భయమే. అందుకే అతన్ని చూడగానే హెడ్మాష్టరు బయటికొచ్చి తన గదిలోకి పిలుచుకొని వెళ్లి కూర్చోబెట్టినాడు. తర్వాత మాకు పిలుపొచ్చింది. మేము భయపడుతూ హనుమప్ప సార్‌తో జరిగిందంతా చెప్పి హెడ్మాష్టర్ గదిలోకి పోయినాం. మమ్మల్ని చూడగానే నారపరెడ్డి బూతులు తిడుతూ అరికాలి మీద పైకి లైచినాడు. శివరాం అతనికి ఎదురుగా నిలబడి ధైర్యంగా తల పైకెత్తి జరిగిందంతా చెప్పినాడు. తన కాళ్లు పట్టుకొని ప్రాధేయపడలేదని కోప మొచ్చిందేమో నారపరెడ్డి శివరాంను కాలితో ఎగిచ్చి తన్నినాడు. 'యేం తప్పు చేసినాం రెడ్డీ, అంత కొడతాండావు,' అని నేను ప్రశ్న వేసినాను భయపడుతూ. శివరాం అతని చేతిని పట్టుకొని విదిలించి వేసినాడు. అది భరించలేక నారపరెడ్డి కాలికి వేసుకున్న చెప్పు తీసుకొని 'మమ్మల్ని ఇద్దరినీ కొట్టడానికి పూనుకున్నాడు. హెడ్మాష్టరు నిలువు గుడ్లు వేసుకొని చూస్తున్నాడు. అంతలోనే హనుమప్ప సార్ వచ్చి అతని చేతిలో ఉన్న చెప్పును లాగి పారేసినాడు. అయనకూ నారపరెడ్డికీ కొంచెం వాదులాట జరిగింది. హెడ్మాష్టరు సర్ది చెప్పి నారపరెడ్డిని ఇంటికి పంపినాడు. మేము అవమానంతో క్లాసుకు వెళ్లి కూర్చున్నాం.

హనుమప్ప సార్ మమ్మల్ని ఓదార్చి అర్ధగంట సేపు ఆవేశంగా మాట్లాడినాడు. 'కుల వ్యవస్థ దేశాన్ని ఇంకా నాశనం చేస్తూనే ఉంది. కుల రహిత సమాజం కోసం మనం పాటు పడాలి. ఆర్థిక సమానత్వం వచ్చినప్పుడు ఈ దేశంలో సాంఘిక మయిన అసమానతలు అవంతకవే నాశనం కాక తప్పవు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లితే అగ్రవర్ణాల వాళ్లే మన కాళ్లకు మడుగు లొత్తుతారు' అని చెప్పిన హనుమప్ప గారి మాటలు మాకు అంతగా అర్థం కాకపోయినా మాలో పట్టుదలను పెంచినాయి. వేరే విషయాలేవీ పట్టించుకోకుండా చదువు మీదే మనసంతా లగ్నం చేసినాం.

అతి కష్టంగా నాలుగేండ్ల కాలం గడిచి పోయింది. శివరాం నేనూ నరసన్నా స్కూలు ఫైనల్లో పాసయినాం. రంగారెడ్డితో పాటు అతని మిత్రులందరూ ఫేల్ అయినారు. అది మాకు గొప్ప విజయంగా తోచింది. చదువు చాలించి యేదయినా ఉద్యోగం చూసుకొని సంసారాలను ఆదుకోమని మా ఇళ్లల్లో ఒకటే పోరు. నాకయితే ఎక్కడయినా చిన్న ఉద్యోగం దొరికితే చేరాలని పించింది. కానీ ఉద్యోగం ఏవిధంగా సంపాదించుకోవాలో తెలీదు. మనసులో మాత్రం కాలేజీ లెక్చరర్ కావాలన్న కోరిక బలంగా ఉంది. శివరాం కూడా హనుమప్ప సార్ సహాయంతో ఎక్కడయినా ఒక చిన్న ఉద్యోగం సంపాదించు కోవాలనుకున్నాడు. అయితే హనుమప్ప సార్ మా అభిప్రాయాలకు అడ్డం వచ్చి కొండంత ధైర్యం చెప్పి మమ్మల్ని కాలేజీలో చేర్పించినాడు. అప్పుడు డిగ్రీ కాలేజీ అనంతపురంలో మాత్రమే ఉండేది. అనంతపురం డిగ్రీ కాలేజీలో చదవడమనేది మావంటి వాళ్లకు అప్పుడు కలలో కూడా సాధ్యం కాని పని. అటువంటిది మేము నాలుగేండ్లు అనంతపురంలో చదవడమంటే సామాన్యమయిన

విషయం కాదు. హనుమప్ప కష్టపడి మాకు వెల్ఫేర్ హాస్టల్లో సీటు కూడా ఇప్పించినాడు. కానీ అప్పటికే హాస్టల్లో ఉన్న రూములన్నీ నిండిపోవడంతో వార్డెన్ మాకు హాస్టల్లో భోజన సౌకర్యం మాత్రం కల్పించి బయట రూము తీసుకొని చదువుకొమ్మన్నాడు. మాకయితే ధైర్యం చాలలేదు. హనుమప్ప టీచరే మా చేతిలో పది రూపాయలు పెట్టి ప్రతి నెలా సహాయం చేస్తానని ధైర్యంగా చదువుకొమ్మని చెప్పి వెళ్లిపోయినాడు. ఏమి చెయ్యాలో హనుమప్ప టీచర్ని ఏమని అనుకోవాలో మాకు దిక్కు తోచలేదు.

భయంభయంగా దిగులుగా బిక్కుబిక్కుమను కుంటూ శివరాం, నేనూ డిగ్రీ చదవడం ప్రారంభించినాం. చదువు కోసం అప్పుడు మేము అనంతపురంలో ఉండడం విక్రమార్కుని సాహసం వంటిది. ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కడం వంటిది. ఆకాశానికి నిచ్చెన వెయ్యడం వంటిది. అయినా మొండి ధైర్యం తెచ్చుకున్నాం. భవిష్యత్తు మీద ఆశలు పెంచుకున్నాం. అయితే అడుగడుగునా పేదరికం వల్ల ఎన్నో ఇబ్బందులు కలిగేవి. ఆ ఇబ్బందులు మాలో పట్టుదలను పెంచేవి. కానీ పేదరికం కంటే మమ్మల్ని సమాజం ఎక్కువ గాయపరిచేది. మమ్మల్ని పురుగుల కన్నా హీనంగా చూసేది. ఒక్కొక్క సంఘటనా మాలోని రక్తాన్ని మరిగించేది. మమ్మల్ని సమాజం బాధ పెడుతున్నట్లు ఎక్కడా కనిపించేది కాదు. రాజకీయ నాయకుల ఉపన్యాసాల్లో స్వాముల ఉపదేశాల్లో రేడియో ప్రసంగాలలో ఎక్కడ విన్నా సర్వ మానవ సౌభ్రాతృత్వ ప్రసంగాలే. కానీ జీవితంలో మాకు అడుగడుగునా అవమానాలే. ఏ విధంగానయినా గట్టిగా చదువుకొని మంచి ఉద్యోగాలలో చేరి ఆ అవమానాలకు దూరం కావాలని నేనూ శివరామూ దృఢ సంకల్పం పెంచుకున్నాం.

మేమిద్దరమూ డిగ్రీ ఫైనల్ చదువుతున్న రోజులవి. ఒకనాడు మా తరగతి గదిలో మా క్లాస్‌మేట్ దేవదాస్‌ను అభినందిస్తూ ఒక మీటింగ్ జరిగింది. దేవదాస్ బ్యాంక్ ఉద్యోగిగా సెలెక్ట్ అయిన సందర్భంగా మా క్లాస్‌మేట్స్ అందరూ కలిసి ఆ మీటింగును ఏర్పాటు చేసినారు. మీటింగుకు కొంతమంది లెక్చరర్లు కూడా వచ్చినారు. మేమంతా దేవదాస్‌ను అభినందించినాం. మాతోపాటు చదువుతున్న వాసుదేవ శాస్త్రి చివరగా మాట్లాడుతూ అదే ఉద్యోగానికి తానూ కూడా ప్రయత్నం చేశానని, తనకు దేవదాస్ కంటే పది మార్కులు ఎక్కువ వచ్చినా రిజర్వేషన్ కారణంగా దేవదాస్‌కు ఉద్యోగం వచ్చిందని అది ప్రజ్ఞను అవమానించడమే నని రిజర్వేషన్స్ ఉన్నత కులాల వాళ్లకు తీరని నష్టం కలిగిస్తున్నాయని ఆవేశంగా ఉపన్యసించినాడు. దానిమీద వాదోప వాదాలు జరిగినాయి. ఆనందంగా జరగవలసిన సమావేశం ఆవేశాలతో ముగిసింది. నేనూ శివరాం బరువుగా నిట్టూరుస్తూ ఇంటికి బయలు దేరినాం.



మేము మా రూముకు చేరుకునేటప్పటికి అక్కడ ఇంటి ఓనర్ ప్రభాకరరావు గారి భార్య మా రూములో ఉన్న మరొక మిత్రుని మీద విరుచుకు పడుతూ ఉంది. నేను ప్రశాంతంగా ఆమె దగ్గరికి వెళ్లి విషయ మేమిటో తెలుసుకున్నాను. 'ఏమిటని అడుగుతావేమయ్యా? రూములో చేరేటప్పుడు జ్ఞాన ముండనక్కరలేదా? కులం దాచిపెట్టి మా ఇంట్లో చేరుతారా? మేము బ్రాహ్మల మన్న బుద్ధీ జ్ఞానం లేదా?' ఆవేశంతో చేతులు ఊపిందామె. ఆమె మాటలు విని శివరాం కొంచెం సేపు అవమానంతో కుంగిపోయినాడు. నేను అసహనంతో ఉడికి పోయినాను. ఇద్దరమూ కులాలను గురించి ఆమెకు క్లాస్ తీసుకున్నాం. మా మాటలేవీ పట్టించుకోకుండా ఆమె యేదేదో గొణుగుతూ సాయంకాలానికంతా రూము ఖాళీ చెయ్యండని చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయింది.

మిత్రులం ముగ్గురమూ రూములో కూర్చున్నాం. కొంచెం సేపు మౌనం ఆవరించు కుంది. పొందిన అవమానం మాటిమాటికీ నిట్టూర్పుల రూపంలో బుసలు కొడుతూ ఉంది. నా చెవుల్లో ఇంటి ఓనర్ మాటలూ క్లాస్‌రూమ్‌లో శాస్త్రి అన్న మాటలూ వేసుకుల మాదిరి కుచ్చుకోసాగినాయి.

మాలామాదిగల కున్న రిజర్వేషన్ సౌకర్యం వల్ల ఉన్నత కులాల వాళ్లకు అన్యాయం జరుగుతూ ఉందట! మరి సాంఘికంగా మాదిగలకు ఇంత అన్యాయమూ, అవమానమూ జరుగుతూ ఉంటే దానికి కారకులెవరు? ఈ రోజు మాదిగల ప్రతిభను అవహేళన చేస్తున్నారు. తరతరాల నుండీ వాళ్ల ప్రతిభను దోచుకున్నదెవరు? శతాబ్దాలుగా కష్టం చేసింది మాలామాదిగ లయితే వాళ్ల కష్టాన్ని దోచుకుని సుఖపడడానికి ఉన్నత కులాల వాళ్లకు ఎవరు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినారు?

అనేక ప్రశ్నలతో నా శరీరం అగ్ని గుండ మయింది. పల్లెల్లో హీనంగా ఉన్న మా కులం సోదరులను ఈ దేశ కుల సంస్కృతి తరతరాల నుండీ ఎంత నీచంగా చూస్తూ ఉందో అనుభవాలతో పాటు గుర్తుకు తెచ్చుకొని నేనూ శివరాం ఉడికి పోయినాం. ఆర్థికంగా రాజకీయంగా మాలామాదిగలు ఎదిగినప్పుడే వాళ్లకు సాంఘిక న్యాయం లభిస్తుందని, ఎలాగయినా రాజకీయా ధికారం దక్కించుకోవాలని శివరాం దృఢంగా మనసులో నిర్ణయించుకున్నాడు.

కాలం మమ్మల్ని ఎన్నో అవమానాలకు గురి చేస్తూ బరువుగా సాగిపోయింది. నేను చదువు ముగించుకొని లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరడం, శివరాం బి.ఎల్. చదివి లాయరుగా ప్రాక్టీసు పెట్టడం, మంచి పేరు తెచ్చుకొని రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం అంత లోపలే కళ్యాణ దుర్గం రిజర్వుడు నియోజక వర్గానికి అభ్యర్థిగా నిలుచుకోమని అధికార పార్టీ నుండి పిలుపు రావడం, శివరాం ధైర్యం చేసి పోటీకి దిగి కళ్యాణ దుర్గం నుండీ శాసన సభ్యుడుగా ఎన్నిక కావడం నాలుగైదు సంవత్సరాలలో చకచకా జరిగిపోయినాయి...

శివరాం మంత్రి అయినాడన్న ఆనందంతో తేలిపోయిన మనస్సు వెనకటి జ్ఞాపకాలతో కొంచెం బరువెక్కింది. ఈజీ ఛేర్‌లో నుండి పైకి లేచి వరండాలోకి వెళ్లి వీథుల్లోకి చూసినాను. మధ్యాహ్నం దాకా ఆనందోత్సాహాలతో హోరెత్తిన పట్టణం నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడా కేకలూ కేరింతలూ లేవు. అవును ఎందుకుంటాయి. ఒక మాదిగ వాడు మంత్రి అయినాడు కదా! మాదిగల అభివృద్ధిని అభినందించడానికి జనం ఎవరొస్తారు? తమ బలాన్నీ ఐకమత్యాన్నీ చూపుకోడానికి మాదిగలకు తెగింపు కానీ ఆలోచన కానీ ఎందుకొస్తుంది? ఏమి చెయ్యాలనుకున్నాచ చివరికి ఆనందం చాటుకోవాలనుకున్నా తరతరాల నుండీ పొందిన అవమానం వెనక్కి లాగుతుందేమో!

చీకాకు పడుతూ బజార్లోకి వెళ్లి మిత్రులందరినీ కలుసుకుందామని బయలు దేరుతున్నాను. అంతలోనే, 'రంగారెడ్డిని మంత్రివర్గంలోకి చేర్చుకోవాలి. కదిరి సింహం రంగారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.' అంటూ సుమారు ఐదారు వందల మంది గట్టిగా నినాదాలు చేస్తూ పోయినారు. నా శరీరమంతా తేలు పారాడినట్లయింది. మరొక అర్ధగంటలోపలే దాదాపు వెయ్యిమంది. 'ధర్మవరం రాజకీయ కిశోరం గిరిధర చౌదరి వర్ధిల్లాలి. గిరిధర చౌదరికి మంత్రి పదవి ఇవ్వాలి. అసమర్థ రాజకీయ నాయకుడు శివరాం - డౌన్ డౌన్' అని పెద్దగా కేకలు వేస్తూ ఆవేశంతో చిందులు తొక్కుతూ వెళ్లినారు. నా నరాలు చిట్లినట్లయినాయి. అసహనంతో రక్తం వేడెక్కింది. కిందికి దిగి వచ్చి కొంచెం సేపు అట్లే కూలబడి పోయినాను. మాలతి కాఫీ తెచ్చి ఇచ్చి, 'ఎందుకు అదోకరకంగా ఉండారు?' అని అడిగింది. నేను విషయం చెప్పినాను. 'ఉన్నత కులాల వాళ్లు ఈ కాలంలో ఎస్సీలను రాజకీయంగా ఎదగనిస్తారేమండీ' అని చాలా తేలిగ్గా అనేసి మాలతి లోపలికి వెళ్లిపోయింది.

కాఫీ తాగుతూ వీథిలోకి చూస్తున్నాను. మరొక గుంపు వచ్చింది. నలభై యాభైమంది ఎస్సీలు మాత్రం 'బడుగు వర్గాల నాయకుడు శివరాం గారికీ జై. మంత్రివర్యులు శివరాం గారూ - వర్ధిల్లాలి' అంటూ వెళ్లినారు. ఆ అరుపులో ఎంతో నీరసం ధ్వనించింది. మనసంతా అసంతృప్తితో నిండిపోయింది.

నాలుగు రోజులు గడిచి పోయినాయి. ఆ రోజు శివరాం అనంతపురానికి మొదటి సారిగా వస్తున్నాడు. ఇటీవల రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ దళితుల మీద జరిగిన అనేక దాడుల కారణంగా దళితుల్లో కదలిక వచ్చిందేమో, మంత్రికి స్వాగతం చెప్పడానికి చాలామంది బయలు దేరినారు. నేను నా శక్తి కొద్దీ దళిత సంఘాలనూ బడుగు వర్గాల వాళ్లనూ ప్రోగు చేసినాను. అందరమూ బయలు దేరి జిల్లా సరిహద్దుకు చేరుకున్నాం.

అనుకున్న సమయానికే శివరాం వ్యవసాయ శాఖ కేబినెట్ మంత్రిగా పోలీసు ఎస్కార్టుతో జిల్లా పొలిమేరలోకి అడుగు పెట్టినాడు. ముందర నాలుగూ వెనక నాలుగూ కార్ల మధ్య తెల్లని కారొచ్చి ఆగింది. తన మనసు మాదిరి స్వచ్ఛంగా తెల్లగా నిగనిగలాడుతున్న కార్లో నుండీ మా శివరాం కిందికి దిగినాడు. నా శరీరం పులకరించింది. ఆనంద బాష్పాలు పొంగి పొర్లినాయి. అందరితో పాటూ నేనూ ఒక పూలహారం శివరాం మెడలో వేసినాను. శివరాం నావైపు చూసినాడు. అతని కళ్లల్లో నుండీ కొన్ని సంవత్సరాల మా స్నేహానికి చిహ్నంగా ఎన్నో విషాద జ్ఞాపకాలకు గుర్తుగా బాష్ప బిందువులు ముత్యాల మాదిరి రాలిపడుతూ ఉంటే నన్ను ఆలింగనం చేసుకున్నాడు. నా శరీరం నలుమూలల నుండీ ఉద్వేగం పొంగి వచ్చింది. జీవితంలో కలిగిన ఆటుపోట్లకూ పొందిన అవమానాలమూ ప్రతిఫలంగా ఆ గౌరవం దక్కిందనీ అది సమాజంలో మేము సాధించిన విజయమనీ మౌనభాషలో గర్విస్తూ తృప్తి పడినాం. అక్కడికి చేరుకున్న వందలాది మంది జనం శివరాంను అభినందించినారు. ఎంతో ఔన్నత్యం లభించినట్లు గర్వపడింది మనస్సు.

శివరాం ముందూ వెనకా ముప్పై నలభై వాహనాల్లో అందరూ అనంతపురం బయలు దేరినారు. కార్తీక మాసం. రోడ్డుకు ఇరువైపులా పొలాలన్నీ పచ్చని కాంతులతో మిలమిల లాడుతున్నాయి. పచ్చగా విరబూసిన సూర్యకాంతం మొక్కలు రోడ్డు వైపు వొంగి మిత్రునికి శుభాకాంక్షలు తెలుపుతున్నాయి. పండిన సద్ద చేలూ జొన్న చేలూ ఆనందంగా ముఖాలెత్తి స్నేహితుని వైపు గుడ్లప్పగించి చూస్తున్నాయి. కంది కొమ్మలు విరబూసి సంతోషంతో చేతులు ఊపు తున్నట్లున్నాయి. అక్కడక్కడ పెరికి వోదికి వేసిన వేరుశెనగ చేలల్లో నుండి రైతు జీవితాలను పరవశింప జేసే పరిమళం వీస్తూ ఉంది. గట్ల మీదా నట్లమీదా ఉన్న తంగేడు చెట్లూ పల్లేరు మొక్కలూ రకరకాల గడ్డి మొక్కలూ అందంగా విరబూసి తమను ప్రేమించిన ఆ మిత్రునికి సువాసనలతో స్వాగతం పలుకుతున్నాయి.

అంతా గమనిస్తూ స్కూటర్లో వెళుతున్నాను. వచ్చిన జనమంతా బడుగు వర్గాల వాళ్లే. జిల్లా రాజకీయ నాయకులు కలికానికయినా లేరు. ఉన్నత కులాల రాజకీయ నాయకులు అసలే లేరు. మళ్లీ మళ్లీ గమనించి చూసినాను. నిజం! ఉన్నత కులాల నాయడొకడూ లేడు. నా మనస్సు చివుక్కుమనింది. వెనకటి మంత్రివర్యుల ఆర్భాటాలు గుర్తుకొచ్చినాయి.

సరిగ్గా నాలుగు సంవత్సరాల కిందట. ఎన్నికలు కాగానే రాష్ట్ర మంత్రి మండలి ఏర్పడింది. ధర్మవరం శాసన సభ్యుడు గిరిధర చౌదరికి డిప్యూటీ మంత్రి పదవి వచ్చింది. ఆయనగారు మంత్రిగా జిల్లాకు వచ్చినప్పుడు అనంతపురం నుండీ గుత్తి వరకూ యాభై కిలోమీటర్ల పొడవునా రోడ్డుకు బ్యానర్లు కట్టినారు. రోడ్లో మామూలు వాహనాలన్నిటినీ రద్దు చేసినారు. జిల్లా నలుమూలల నుండీ మండలానికి పది వాహనాల చొప్పున ఆరు వందల వాహనాలను రోడ్డు పొడవునా నిలబెట్టినారు. బెంగుళూరు నుండి మంత్రిగారి బరువుతో సమానమయిన గులాబీల హారాలు తెప్పించినారు. మూడు నాలుగు లక్షల మందిని కూలి ఇచ్చి వాహనాల్లో తోలి గుత్తి దాకా జనహారం కట్టినారు. కిలోమీటరుకొకటి మంత్రిగారి నిలువెత్తు కటౌట్లను నిలబెట్టినారు. ప్రతివాహనం మీదా తప్పెట్లను ఏర్పాటు చేసినారు.

జిల్లాలోని అగ్రనాయకులందరూ మంత్రిగారికి స్వాగతం చెప్పడానికి తరలి వచ్చినారు. ప్రతి పల్లెలో నిక్కబొడుస్తున్న అగ్రకులాల నాయకు లందరూ ఆనందోత్సాహాలతో అక్కడ చేరు కున్నారు. అభిమానులు లక్షలాది రూపాయల విలువచేసే టపాకాయలను పేల్చినారు. కూలికి వచ్చిన పేద జనాన్ని రోడ్డు దాటి పక్కకు పోకుండా నాయకులు కట్టెలు పట్టుకొని అదిలించినారు. గుత్తి దగ్గర నుండి సాగి వచ్చిన జన సమూహమంతా



వచ్చి చేరేటప్పటికి అనంతపురం సముద్రం మాదిరి హోరెత్తింది. అరాచకమయిన శబ్దాలతో నినాదాలతో మందుగుండు పేల్చిన పొగలతో అనంతపురం యుద్ధంలో తగలబడినట్లు మారిపోయింది. సారాయీ కల్లూ ఏరులై పారినాయి. అల్లరి మూకలు వెర్రి ఆవేశంతో తాగిన మైకంలో చిందులు తొక్కుతూ ఆరు మంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారు.

జరిగిన బీభత్సాన్ని గుర్తు చేసుకొని బరువుగా నిట్టూరుస్తూ అటువంటి ఆర్భాటం నా మిత్రునికి అవసరం లేదనుకుంటూ నిరాడంబరంగా ఆత్మీయంగా సాగిన మిత్రుని స్వాగత ప్రదర్శనలో కలిసి వచ్చి ఊరు చేరుకున్నాను. తర్వాత ఉద్యోగ బాధ్యతలో మునిగిపోయిన నేను వీలయినప్పుడు మాత్రమే శివరాంను కలుసుకోసాగినాను. శివరాం కొత్త జీవితానికి క్రమేణా అలవాటు పడినాడు. తమ బడుగు వర్గాల వాడు మంత్రి అయినాడని అతనితో తమ కష్టాలను చెప్పుకోడానికి వస్తున్న పేదల సంఖ్య పెరుగుతున్నా పరిపాలన సంబంధమయిన సమస్యలు చర్చించడానికి అధికారులు వస్తున్నా శివరాం అంతకు ముందు బాడుగకున్న ఆ చిన్న ఇంట్లోనే మంత్రి అయిన తర్వాత కూడా ఉండడం అందరితో పాటు నాకూ ఆశ్చర్యం కలిగించినా సంతోషమయింది.

రెండు నెలల కాలం గడిచిపోయింది. శివరాం నెలకు కనీసం పది దినాలు తన సొంత నియోజక వర్గంలో జిల్లాలో తిరుగుతూ ప్రజల సమస్యలను నెరవేర్చడానికి పూనుకున్నాడు. క్రమంగా పేద వర్గాల వాళ్లు అతనికి దగ్గరవుతున్నారు. తమకేదో కొత్త బలం వచ్చినట్లు ఆనందిస్తున్నారు. తమ మీద దౌర్జన్యం చేసే అగ్రకులాల వాళ్ల మీద తిరగబడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. సమాజంలో ఏదో మార్పు జరుగుతున్నట్లు నేను పొంగి పోయినాను.

పల్లెల్లో వస్తున్న మార్పులు అగ్రకులాల వాళ్లకు ఒంటి మీద జిల్లేడు పాలు చల్లినట్లు బాధ కలిగించినాయి. జిల్లాలోని అగ్రకుల రాజకీయ నాయకులను కాదని ఒక దళితునికి మంత్రి పదవి ఇవ్వడం ఎవ్వరికీ రుచించలేదు. అధికార పార్టీకి చెందిన నాయకులే ప్రతి చిన్న విషయం లోనూ మంత్రి చేసే పనులను వ్యతిరేకించడానికి పూనుకున్నారు. కొంతమంది శివరాం మీద బురద చల్లడానికే దిగినారు. మంత్రి పదవి నుండి తప్పించడానికి పన్నాగాలు పన్నసాగినారు. ఒక వైపు చాటుమాటునా గోతులు తవ్వుతూనే తమ సొంత పనులు నెరవేర్చుకోడానికి మీటింగులు పెట్టి శివరాంకు సన్మానాలు చేసి తమ పబ్బం గడుపుకోసాగినారు.

ఒకరోజు శివరాం వచ్చినాడని తెలిసి సాయంకాలం నేను బంగ్లా దగ్గరికెళ్లినాను. బి.ఎల్. చదివే రోజుల్లో తనకు మంచి స్నేహితుడైన కుళ్లాయప్పను నాకు పరిచయం చేసినాడు శివరాం.

అంబేద్కర్ చైతన్య క్లబ్ ఆధ్వర్యంలో తాను నడుపుతున్న స్కూలు ద్వారా కుళ్లాయప్ప పేరు నాకు బాగా తెలుసు. ఆ స్కూలుకు పట్టణంలో మంచి పేరుంది. కుళ్లాయప్ప ఆ స్కూల్ ద్వారా బాగా పేరు పొంది ఎన్నో అవమానాల కారణంగా ఇటీవలే రాజకీయాల్లోకి దిగి వార్డు కౌన్సిలర్ అయినాడు. వాళ్లస్కూల్లో అంబేద్కర్ సాంస్కృతి కోత్సవాలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా శివరాం బయలు దేరుతున్నాడు. నేను వెళ్లడంతో నన్నూ రమ్మన్నారు. ఆ కార్యక్రమం వారం రోజుల కిందటే ఫిక్స్ అయినట్లు కుళ్లాయప్ప నాతో అన్నాడు.

అందరూ బయలుదేరుతున్నాం. అంతలోనే గిరిధర చౌదరి ఒక పదిమంది తన ప్రయివేట్ సైన్యంతో హడావుడిగా వచ్చినాడు. వచ్చీ రావడంతోనే సిగరెట్ అంటించుకొని మంత్రికి ఎదురుగా కూర్చొని పొగ పీల్చి ఒదులుతూ 'ఏమయ్యా శివరాం, అప్పుడే శానా పెద్దోనివి అయిపోయినావే! అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆ కొండన్న గాన్ని నేను ట్రాన్సిఫర్ చేయిస్తే నువ్వు వాన్ని మల్లా ఆటికే వేయిస్తావేమయ్యా? నీ కులస్తుడని నువ్వు సపోర్టు ఇస్తే మాత్రం మాత్రం వాడు ధర్మవరంలో పనిచేస్తాడనుకుండావా? అది సరేగానీ, ఇతడు సుబ్బానాయుడని మా బంధువు. ఒక పెద్ద క్లబ్బు ఈ రోజే ప్రారంభిస్తా ఉండాడు. నిన్ను ముఖ్య అతిథిగా పిలుచుకొని వస్తానని మాట ఇచ్చినాను. నా మాట ప్రకారం వాళ్లు ఈ రోజు ప్రోగ్రాం పెట్టుకొని ఇన్విటేషన్స్ కూడా వేసినారు. ఇంకొక గంటకు కార్యక్రమం మొదలవుతాది. నువ్వు ఎట్లన్నా గానీ బయలు దేరల్ల.' అంటూ తాను కూర్చున్న అందమయిన సోఫా హ్యాండ్ మీద సిగరెట్ నలిపేసినాడు.

అతని ధోరణి చూసి నాకు అసహ్యమయింది. టీ పాయ్ మీద సెగరెట్ ముక్కలు వేయడానికి యాష్ట్రే ఉంది. కానీ ఆ శాసన సభ్యుడు నలిపేసిన సిగరెట్ ముక్క, సోఫా పక్కన కార్పెట్ మీద అసహ్యంగా కనిపిస్తూ ఉంటే తలొంచుకొని శివరాం దాని పక్కనే చూస్తున్నాడు. ఆ శాసన సభ్యుడు తాను ముఖ్యమంత్రికి ఒక తమ్ముడయి పోయినట్లు మంత్రి శివరాంను శాసిస్తున్నాడు. అతని దర్పాన్నీ మంత్రిగారి మౌనాన్నీ చూసి కుళ్లాయప్ప దిగులు పడిపోయినాడు. అక్కడున్న వాళ్లందరూ గుడ్లప్పగించుకొని చూస్తున్నారు.

కింది నుండీ పైదాకా అధికార పార్టీలో కులం పేరుతో పెరిగిన సంబంధాలూ తరతరాల నుండీ వచ్చిన డాబూ దర్పమూ అర్థబలమూ అంగ బలమూ అన్నీ ఉన్న గిరిధర చౌదరిని గురించి అక్కడే కాదు, జిల్లాలోనే తెలియని వాళ్లుండరు. అటువంటప్పుడు అతని దగ్గర నోరు మెదపడానికి ఎవరికి ధైర్యముంటుంది? నాకయినా స్నేహితుని పక్షాన మాట్లాడగలిగే సాహసం ఎక్కడుంది?

శివరాం నెమ్మదిగా నిగ్రహంగా తనకు వేరే

ప్రోగ్రాం ఉందన్నాడు. ముందే వచ్చి అడిగి ఉంటే తప్పక వచ్చేవాణ్ణని అన్నాడు. ఆ మాటతో గిరిధర్ అహం దెబ్బ తినింది. నోటికొచ్చినట్లు వాగినాడు. దాన్ని భరించలేక శివరాం ఎదుర్కొన్నాడు. అక్కడున్న వాళ్లందరూ బిత్తర పోయినారు. 'మంత్రి పదవి వొస్తానే మనుషులెవురూ కనిపించడం లేదా నీకు? ఎవరి వల్ల మంత్రివయినావో రొంత గుర్తు తెచ్చుకో' అంటూ కోపంగా పైకి లేచినాడు గిరిధర్.

'తక్కువ జాతి నాయాళ్లను అందల మెక్కిస్తే ఇంతేరా... రారా, అతన్నేమి బంగపోతావు! మనం అనుకుంటే ముఖ్యమంత్రి రమ్మంటే రాడా?' అంటూ సుబ్బానాయుడు గిరిధర చౌదరిని లాక్కొని బయటికి వెళ్లిపోయినాడు. వాళ్ల వెంట సైన్యమంతా ఏదేదో మాట్లాడుతూ వెళ్లిపోయింది. ఎవడో బయట గట్టిగా నోరు చేస్తున్నాడు. 'ఈ మాదిగ నా కొడుక్కి అప్పుడే కండ్లు నెత్తికెక్కి నాయన్నా. పట్టుకొని బయిటికి జరజర ఈడ్చుకరమ్మంటావా?'

వింటున్న నా శరీరం నిప్పుల కుంపటయింది. శివరాం ముఖమంతా కోపంతో బాధతో అవమానంతో రంగులు మారింది. అందరమూ కొంచెం సేపు ఉడికిపోయినాం. ఏసీ రూము వేడెక్కింది. నేనూ కుళ్లాయప్పా జరిగిన విషయమంతా ఎస్పీకి రిపోర్టు చెయ్యమన్నాం. శివరాం తీవ్రంగా ఆలోచించినాడు. పది నిమిషాల పాటు మౌనం పరుచుకుంది. చేతగానితనం శివరాం చూపుల్లో కనిపిస్తూ ఉంది. తన మీద దౌర్జన్యం జరిగితే మంత్రి అయి కూడా శివరాం ఎందుకు మౌనం వహిస్తున్నాడు? పాలనాధికారం ఉండి కూడా దళితుడు పీడింప బడవలసిందేనా? శివరాం అధికారాన్ని ఉపయోగించుకునే శక్తిలేదా?

ఎన్నో ప్రశ్నలు నాలో బుసలు కొట్టసాగినాయి. శివరాం గట్టి నిర్ణయంతోనే కుళ్లాయప్ప వెంట బయలుదేరినాడు. నేనూ వాళ్లను అనుసరించినాను.

తెల్లవారింది. ఒక వార్తాపత్రికలో తాటికాయంత అక్షరాలతో 'మంత్రిగారిచే తాగుడుకూ పేకాటకూ నిలయమయిన క్లబ్బుకు ప్రారంభోత్సవం' అని శివరాం మీద అభియోగం వచ్చింది. చదువుకున్న నా మనస్సు అసహనంతో నిండి పోయింది. అగ్రకుల రాజకీయాలకు కొమ్ము కాస్తున్న ఆ పత్రిక మీద వెగటు పుట్టింది. ఆ వార్తకు శివరాం తీవ్రంగా స్పందించి ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి వాస్తవ విషయాలను వివరించినాడు. దళితుడు రాజకీయాల్లో ఎదగకూడదా అని ఆవేదన వ్యక్తం చేసినాడు. మరుసటి రోజు పత్రికలన్నీ శివరాం చెప్పిన వాస్తవాలను వదిలేసి ఎక్కడో ఒక మూల 'మంత్రి ఆవేదన' అంటూ జాలి పడుతూ రాసినాయి. ఒక పత్రిక మాత్రం గిరిధర చౌదరి చర్యను ఖండిస్తూ రాసింది. ఒక పత్రికయినా దళితుల పక్షం వహించినందుకు శివరాం సంతోష పడుతుండగానే ఆ సాయంకాలం ముఖ్యమంత్రి గారి నుండి శివరాంకు ఫోన్ వచ్చింది. పక్కన నేనూ కుళ్లాయప్పా మరొక మిత్రుడూ తప్ప ఎవరూ లేరు.

ఫోన్లో మాటలు వింటున్న శివరాం ముఖం చప్పబడి పోయింది. మౌనంగా ఫోన్ పెట్టేసి దిగులుగా కూర్చున్నాడు. మేము ఏమయిందని ఆదుర్దాగా అడిగినాం.

'దేని కోసం ఈ మంత్రి పదవి? దళితులకు కూడా పరిపాలనలో భాగం కల్పించి రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నామని చెప్పుకోడానికా? వ్యతిరేక వర్గంలోని ఒక శాసన సభ్యునికున్న స్థానం కేబినెట్ మంత్రికి లెకపోవడమేమిటి? కారణం మేము దళితులం అనేగదా! తమ కులస్థులు ఏమి చేసినా చెల్లుతుందా? ఎవడు అంగాలాసినాడు ఈ మంత్రి పదవి కావల్లని?'

శివరాం చాలా బాధ పడినాడు. మంత్రి పదవితో తానేదో ఉద్ధరిస్తానన్న భ్రమలన్నీ తొలగి పోతున్నాయని వేదన చెందినాడు. బొమ్మ మాదిరి తాను మంత్రిగా ఉండడం దండగని రాజీనామా చేస్తానని కాగితమూ పెన్నూ తీసుకున్నాడు. పత్రికల వాళ్లకు తాను రాజీనామా చేస్తున్నట్లు చెప్పడానికి ఫోన్ ఎత్తినాడు. నేనూ, కుళ్లాయప్పా శివరాంను శాంత పరిచినాం. రాజీనామా చెయ్యడంతో సమస్య తీరిపోదని దళిత సమస్య చాలా లోతయినదని దాన్ని హేతబద్ధంగా తీర్చుకోవాలని నచ్చజెప్పినాం. అతడు మౌనం వహించినాడు.

రోజులు బరువుగా గడిచి పోతున్నాయి. దళిత సాంస్కృతిక మండలి కార్యదర్శిగా చాలా రోజుల నుండీ నేనొక విషయాన్ని శివరాంకు చెప్తుతూ వస్తున్నాను. శివరాం ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకోలేదు. అయితే తన అశక్తతను వ్యక్తం చేస్తూ సమయం వచ్చినప్పుడు ప్రయత్నిస్తానని చెప్పుతూ వొచ్చినాడు. ఒకరోజు హైదరాబాద్ నుండీ ఫోన్ చేస్తూ రాష్ట్ర హోంమంత్రి పద్మారావుతో కలిసి తాను కళ్యాణదుర్గానికి వొస్తున్నట్లు తెలిపినాడు. నేనింతకు ముందు చెప్పిన విషయాన్ని ఫోన్లోనే ప్రస్తావిస్తూ దాన్ని గురించి ఒక మెమొరాండం రాసుకొని సాయంకాలం అనంత



పురం గెస్ట్ హౌస్ దగ్గర కలుసుకోమన్నాడు.

నేను మా మండలి సభ్యులను ఐదారు మందిని వెంటేసుకొని గెస్ట్ హౌస్ దగ్గరికి వెళ్లినాను. అక్కడ ఒక అయిదారు మంది అనామక వ్యక్తులూ వ్యవసాయ శాఖకు చెందిన ఇద్దరు ఆఫీసర్లూ కొంతమంది పోలీసులూ తప్ప ఇంకెవరూ లేరు. ఆ రోజు దినపత్రికల్లో కూడా హోంమంత్రి వొస్తున్నట్లు వార్త వచ్చింది. అయినా గెస్ట్‌హౌస్ ప్రాంతమంతా బోసిపోయి ఉంది. ఆ వాతావరణం చూసి, నా మనసు చిన్నబోయింది. అందుకు కారణాలేమిటని ఆలోచిస్తూ ఉండగానే కళ్యాణదుర్గం నుండీ పైలెట్ జీపూ దాని వెనకాలే మంత్రుల కార్లూ వచ్చినాయి. ఏ హడావుడీ లేదు. మంత్రులిద్దరూ కారు దిగి జనం ఎవ్వరూ లేనిది చూసి గెస్ట్ హౌస్ వరండాలోనే కూర్చున్నారు. ఒక్క రాజకీయ నాయకుడు కూడా వెంటలేడు. ప్రోటోకాల్ చూసే నాథుడే లేడు. జిల్లా అధికార్ల ఆచూకీయే లేదు. కలెక్టర్‌గానీ చివరికి ఎస్‌పీ గానీ అటువైపు తిరిగి చూడలేదు. మంత్రిగారి పి.ఏ. ఫోన్ చేసి కనుక్కున్నాడు. వాళ్లిద్దరూ గిరిధర చౌదరీ రంగారెడ్డీ ఇంకా కొంతమంది ఎం.ఎల్.ఏ.లతో కలిసి పుట్టపర్తికి పోయినట్లు తెలిసింది. మంత్రులిద్దరూ మవునంగా ఒకరి ముఖం వొకరు చూసుకుంటూ కూర్చున్నారు. వాళ్ల చూపుల్లో చెప్పలేనంత చిన్నతనం కనిపిస్తూ ఉంది.

తరతరాల నుండీ ఆశించిన పదవులకు కష్టపడి చేరుకున్నా అడుగడుగునా వెలి వేయబడుతూ వొస్తున్న దళితుల దైన్యం అక్కడ దళిత మంత్రుల ముందు పరుచుకుంది. హాలంతా నిశ్శబ్దంగా ఉంది. వచ్చిన ఐదు పది మందీ ఏమీ మాట్లాడకుండా వాళ్ల వైపు చూస్తున్నారు. నేను అంతా గమనిస్తూ ఆలోచిస్తున్నాను.

ఎంత దయనీయమయిన పరిస్థితి? కనిపించకుండా సమాజం దళితుల ఔన్నత్యాన్ని ఎంత మవునంగా అవమానిస్తున్నది! ఒక అగ్రకుల మంత్రికి ప్రజలు బ్రహ్మరథం పట్టడమేమిటి, దళిత మంత్రిని లెక్కచేయక పోవడమేమిటి? దళితుని దగ్గర అధికారం కూడా అంటరానిదైపోతూ ఉందా?

రకరకాల ప్రశ్నల మధ్య నలిగిపోతున్న నన్ను శివరాం పిలవడంతో బరువుగా నిట్టూర్చి దగ్గరికి వెళ్లినాను. శివరాం నన్ను హోం మంత్రి పద్మారావుకు పరిచయం చేసినాడు. నేను సవినయంగా నమస్కారం చేసి తెచ్చిన మెమొరాండం ఆయనకు అందజేసినాను. హరిజనుల్లో గొప్పగా చదువుకొని విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తూ రాష్ట్రంలో గొప్ప మేధావిగా పేరుపొందిన రాజరత్నం వంటి వాళ్లు చాలా అరుదని ఆయనను మా యూనివర్సిటీ వీసీగా వేయించండని గట్టిగా విన్నవించినాం. అంత స్థాయికి ఎదిగిన వ్యక్తి దళితులలో దొరకడం సులభం కాదని ఆయన పేరును ముఖ్యమంత్రికి రెకమెండ్ చేయండని కోరినాం.

పద్మారావు మా మెమొరాండం చూసి మమ్మల్ని అభినందించినాడు. కొంచెం సేపు మవునంగా ఉండి శివరాం వైపు చూసి నవ్వినాడు. ఆ నవ్వులో శతాబ్దాల తరబడి వెన్నంటి వొస్తున్న దళిత దైన్యం పొరాడింది. 'రిజర్వేషన్ ఉండడం వల్ల మమ్మల్ని మంత్రులుగా తీసుకున్నారేగానీ మా మాటలకు ఏం విలువ ఉంది నాయనా? రాజరత్నం గొప్పవాడని నాకూ తెలుసు. అయినా వి.సి. పోస్టును ఒక మాదిగ వానికి ఇప్పించ గలిగిన శక్తి మాదిగలకు ఉన్నప్పుడు ఈ వాతావరణం ఇల్లా ఉండేది కాదు బాబూ' అంటూ పద్మారావు అన్నప్పుడు నా కనుగుడ్ల మీద నీళ్లు పొరాడినాయి.

దాదాపు ఇరవైయేళ్లుగా పద్మారావు శాసన సభ్యుడుగా ఉంటున్నాడు. రెండు దఫాలుగా మంత్రి అయినాడు. అంత పేరున్న పద్మారావే దళితులు మంత్రులయినా కేవలం బొమ్మలేనన్న అభిప్రాయం వ్యక్తం చెయ్యడం నాకు ఆశ్చర్యం కలిగించింది. తీవ్రంగా ఆలోచిస్తున్నాడేమో, శివరాం పెదవులు మునిపళ్ల కింద నలిగిపోతూ ఉంటే చూసి బరువుగా నిట్టూరుస్తూ వాళ్ల దగ్గర శెలవు తీసుకొని ఇంటికి బయలుదేరినాను.

మాఘమాసం వచ్చింది. పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. శివరాం బాడుగకు ఉంటున్న ఇంటి యజమాని శివరాంకు దూరపు బంధువే. తన కూతురు పెళ్లి చేస్తున్న కారణంగానూ, ఇంట్లో బాడుగకు ఇచ్చిన పోర్షన్ కూతురుకు కట్నం కింద రాసివ్వడం కారణంగానూ అతడు శివరాంను ఇల్లు వదలమన్నాడు. వాళ్లకు ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక తొందరగా మరొక ఇల్లు చూడమని నాకూ మరొక మిత్రునికీ చెప్పి శివరాం హైదరాబాద్ వెళ్లిపోయినాడు. స్నేహితుడుగా నేను ఆ బాధ్యతను మోసుకొని బాడుగ ఇంటికోసం గాలిస్తున్నాను. మా ఇంటి వెనక వీథిలో ఒక మంచి ఇల్లు ఖాళీగా ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. నేను వెంటనే వెళ్లి ఇల్లు చూసినాను. ఇల్లేమో చాలా బాగుంది. ఆ ఇంటి యజమానితో కలిసి నా స్నేహితునికని చెప్పి బాడుగ మాట్లాడి అడ్వాన్స్ ఇచ్చి ఆ విషయం శివరాంకు తెలియ జేసినాను.

రెండు రోజుల్లో ఇల్లు మారాలని శివరాం మనుషులు ఇంట్లో సామాన్లన్నీ ప్యాక్ చేయసాగినారు. చేరబోతున్న ఇంటిని ఒకసారి చూసి వచ్చేది మేలనుకొని నేను అటు వైపు వెళ్లినాను. ఇంటి యజమాని జయచంద్రగౌడు ఇల్లంతా శుభ్రం చేయిస్తున్నాడు. నేను 'నమస్తే సార్' అంటూ దగ్గరికి పోయినాను. అతడు నన్ను చూడగానే జేబులో నుంచీ డబ్బు తీసి నా చేతికిస్తూ 'సారీ నండీ, మీ అడ్వాన్స్ వెనక్కి తీసుకోండి. ఈ ఇంట్లోకి మంత్రి శివరాంగారు చేరుతున్నారట కదా!' అంటూ నవ్వినాడు.

'అవునండీ, మీకెవరు చెప్పినారు?' ఆత్మీయంగా అడిగినాను. మంత్రిగారి నుండి ఇంటి బాడుగ అడ్వాన్స్ తీసుకోవడం మంచిది కాదనుకొని నాకు వాపసు ఇస్తున్నాడనుకున్నాను. శివరాం పట్ల అతడు గౌరవం చూపుతున్నందుకు ఆనందించినాను. అతడు ఒక నిమిషమయిన తర్వాత చెప్పడానికి చాలా ఇబ్బంది పడుతూ, 'సారీ నండీ, ఎస్సీలకు ఇల్లు బాడుగకు ఇవ్వడానికి మా ఇంట్లో ఒప్పుకోలేదండీ. వెరీ వెరీ సారీ' అని గబగబా చెప్పేసి అతడు లోపలికి వెళ్లిపోయినాడు.

జయచంద్ర గౌడ కులమేదో నాకు తెలుసు. బీసీలకు కూడా మేము వెలివాడల వాళ్లమే, అంటరాని వాళ్లమే - అయిపోతున్న పరిస్థితి.

నా తల తిరిగి పోయింది. కోపంతో బాధతో సిగ్గుతో అవమానంతో నా వొళ్లంతా చెమట పట్టింది. తరతరాల నుండీ నన్ను అవమానిస్తూ వచ్చిన విష సంస్కృతి వెక్కిరించింది. 'ఆర్థిక సమానత్వం వస్తే అన్ని అసమానతలూ తొలగి పోతాయి' అంటూ పదే పదే చెప్పిన మా గురువు హనుమప్ప గారి మాటలు సడన్‌గా గుర్తుకొచ్చి నా పెదవుల మీద వికృతమయిన నవ్వు పొరాడింది. ●